# నాన్న కావాలి

"నాన్నా! నాన్నా. ఎక్కడికి ఎలుతున్నావు?" చెప్పులేసుకుని బయటకు వెళ్ళబోతున్న కుమార్‌ని ప్రశ్నించాడు రవి.

"ఏట్లోకెడుతున్నా! నీకెందుకురా? వళ్ళు నూరుకుంటూ సమాధానమిచ్చాడు.

"అయితే ఏట్లోకి నీతో వత్తా నాన్నా! నన్నూ తీసుకెల్లు" అయిదేళ్ళ రవికి బయట తిరగాలంటే చెప్పలేని సరదా.

"నీకు కావలసిందీలేదు. అక్కరలేందిలేదు. నన్ను చంపుకు తినడానికి పుట్టావురా! లంబాడీదెయ్యంలా నన్ను పీక్కు తింటున్నావురా?"

"లంబాడీ దెయ్యమంటే ఏంతి నాన్నా"

"ఇదిగో నీలాగె పీక్కుతినేవాళ్ళని అలా అంటారులే. వెధవప్రశ్నలు, ఇంక నోరుమూసుకో" కోపం పట్టలేక వళ్ళు స్వాధీనంతప్పి చెయ్యి ఎత్తాడు.

"అమ్మా! నాన్న కొలుతున్నాడు" ఏడుపు మొదలుపెట్టాడు రవి.

"నాన్న ఎందుకు కొడతార్రా" వంటింట్లోంచి ఇవతలకు వచ్చింది ప్రియ.

వెక్కి వెక్కి ఏడుస్తూ తల్లిని వాటేసుకున్నాడు రవి. కొడుకు అంతగా ఏడుస్తుంటే అర్థంకాని ప్రియ ఆశ్చర్యంగా చూసింది కుమార్‌ని.

"నేను పనిమీద బయటకు పోతుంటే వెంటబడుతున్నాడు. ఇప్పుడెందుకురా అంటే ఏడుపు మొదలుపెట్టాడు" ప్రియ అడక్కుండానే సంజాయిషీ చెప్పుకున్నాడు.

అతని సమాధానం ఆమెను సమాధానపరచ లేకపోయింది ఏదైన ఈమధ్య కుమార్ మారిపోయాడు. రవిని అనవసరంగా చీదరించుకుంటున్నాడు. మనస్సులో మథనపడింది.

కుమార్ రవి పొత్తును భరించలేకపోతున్నాడు. 'నాన్నా' అని పిలుస్తుంటే అతనిలో మంటలు రగులుతున్నాయి. "తనకీ ప్రియకీ మధ్య అడ్డుగోడలా నిలబడ్డాడు రవి" అనుకున్నాడు మనస్సులో.

ప్రియాదేవి ఒడిలో రవినిచూస్తే ఆమె పరాయిస్త్రీలా కనబడుతోంది అతనికంటికి. ఆ బాధ తను భరించలేడు. తనకు అసలు రానురాను మనశ్శాంతే దూరమైపోతోంది. ఈ రవిని ఎక్కడికైనా దూరంగా పంపెయ్యాలి అనుకున్నాడు.

"ప్రియా! రవిని మరీ గారంచేసి పాడుచేస్తున్నావు. అసలు చదువేలేదు. రోజురోజుకీ పెంకితనం పెరిగిపోతోంది. మంచి కాన్వెంటులో చేరిస్తే బాగా వృద్ధిలోకి వస్తాడు. వాడి భవిష్యత్తేకదా మనకు కావలసింది" ఎన్నాళ్ళనుంచో చెప్పవలసిన మాటలు పుల్‌స్టాపు లేకుండా గటగటా అప్పచెప్పినట్లు చెప్పేసాడు. తర్వాత గుండెలమీద చెయ్యివేసుకుని ఊపిరి గట్టిగా పీల్చుకున్నాడు.

ఆ మాటలు వినలేకపోయింది ప్రియ. అతను ఏ ఉద్దేశంతో అంటున్నాడో అర్థం చేసుకోలేకపోయింది.

"కుమార్! రవిని కాన్వెంటులో చేర్పించడమా! తల్లి బ్రతికుండగానె హాస్పటల్‌కి పంపటమా! మనకిమాత్రం ఎవరున్నారు? అయిదేళ్ళ బాబు ఇంతకంటె ఏం చదువుతున్నాడు? ఇంకెప్పుడూ ఆ మాటనకు నాదగ్గర. నేను భరించలేను. వాడిని వదిలి నేను బ్రతకలేను. మధు జ్ఞాపకంరాగానె ఆమె కళ్ళలో నీళ్ళు తిరిగాయి. రవి చేయిపట్టుకుని నడిపించుకుంటూ వంటింట్లోకి వెళ్ళిపోయింది. ప్రియాదేవి ఏడుపును చూడలేక ఆమెను ఓదార్చే ధైర్యంలేక మధనపడ్డాడు కుమార్.

"రవీ! పార్కు కెడదాం రా బాబూ" అంటూ తల్లి చేతిని పట్టుకున్న రవిని విడిపించి ఎత్తుకున్నాడు కుమార్.

అనవసరంగా అతన్ని అనుమానించాననుకుంది ప్రియాదేవి. రవిని తీసుకుని పార్కువైపు నడిచాడు కుమార్.

పార్కులో వారగా కూర్చున్న కుమార్ మనస్సులో ఆలోచనలు సముద్రతరంగాల్లా ఎగసి, ఎగసి పడుతున్నాయి. తన జీవితం అర్థరహితంగా మారిపోయినందుకు మధనపడ్డాడు. ఆదర్శ వివాహం చేసుకుని ఒక అనాథను ఆదుకున్నాననుకున్నాడు. పెళ్ళి రోజున అందరూ పొగిడినవారే. తన ఆదర్శాన్ని త్యాగాన్ని మెచ్చుకున్నవారే. స్నేహితుడైన మధు ఆ లోకంనుంచే తనను ఆశీర్వదిస్తున్నాడనుకున్నాడు.

కాని కాని నేడు జరిగిందేమిటి? రవి ఉనికిని తాను భరించలేకపోతున్నాడు. ఏదో గుండెల్లో చెపలేనిబాధ. పురుషుడు భార్య

పోతే మరో పెళ్లిచేసుకుంటాడు. సవతిపిల్లల్ని ఎంతో బాగాచూసుకుంటుంది. స్త్రీపాటి హృదయం తనకు లేకపోతోందా? లేక స్త్రీ కూడా మనస్సులో ఇదేవిధంగా బాధపడుతుందా?

సమాజంలో ఏనాటినుంచో వస్తున్న ఆచారంవల్ల స్త్రీ అలవాటు పడిపోయింది. తనకేం ఖర్మయిది" అలా ఆలోచిస్తున్న అతనిలో కోపం పడగవిప్పింది. ఆశయం వేరు. ఆచరణ వేరనే సంగతి అతనికి తెలిసిపోయింది. రవిని అంతం చేయాలనుకున్నాడు. ఏవిధంగానో అతనికి తెలియలేదు.

ఒకరోజు ఇలాగె మథనపడి పడి చివరకు నిద్రమాత్రలు తీసుకుని ఇంటికి వెళ్ళాడు. నైట్‌డ్యూటీకి వెళ్ళింది ప్రియాదేవి టెలిఫోన్ ఆపరేటర్‌గా పనిచేస్తోంది. తెల్లవారితేకాని ఇంటికిరాదు.

రాత్రి భోజనంచేసిన తరువాత పాలల్లో కలిపాడు నిద్రమాత్రలు. రవిచేత తాగించాలని ఎంతో ప్రయత్నం చేసాడు. "నాన్నా! నాకొద్దు నువ్వేతాగు" అంటూ ఏడుపు మొదలెట్టాడు రవి.

ఎంత బ్రతిమాలనా తాగలేదు. చివరకు చేతిలోగ్లాసు కింద పడి పాలన్నీ ఒలికిపోయాయి. రవి హాయిగా నిద్రపోయాడు. ఆ రాత్రి గదంతా కడిగి మరీ పడుకోవలసి వచ్చింది కుమార్‌కు. ఈసారి మరింత తెలివిగా ప్రవర్తించాలి. వీడు కనబడకుండా పోతేతప్ప నామనస్సుకు విశ్రాంతిలేదు. నా కంటికి కునుకులేదు అనుకున్నాడు.

"నాన్నా! చూలు! చూలు! నా బుగ్గ ఎలా ఎగిరిపోతోందో" అంటూ దారం కట్టిన బుగ్గను ఎగరవేస్తు చప్పట్లు కొడుతున్నాడు రవి. కుమార్ వినిపించుకున్నట్లు అనిపించలేదు.

"నాన్నా! చూలు! చూలు" మళ్ళీ పిలిచాడు.

ఈసారి ఈలోకంలోకి వచ్చాడు కుమార్. 'నాన్నా'అన్న పిలుపే అతన్ని నిలువనియ్యటంలేదు. పైగా ఎప్పుడూ కూడా పడతాడు. ఆ చనువు అతనికి మరింత కోపాన్ని కలిగిస్తోంది.

"ఏంటీ?" గుడ్లు మిటకరించి చూసాడు.

అంతలో రవి చేతిలోఉన్న బుగ్గ దారం తెగి ఎగిరిపోడం మొదలుపెట్టింది.

"నాన్నా! నాన్నా!" అంటూ ఏడుస్తూ దాని వెనకాల పరుగెడుతున్నాడు రవి. పక్కనే తామరపూలతో ఉన్న కొలను ఉంది. అది చూసుకోకుండా వెనకనుంచి పోతున్నాడు రవి, రెండు అడుగులువేస్తే పడిపోతాడు.

అన్నీ చూస్తున్న కుమార్ అందులో పడితే పీడా పోతుం దనుకున్నాడు. అటునుంచి వస్తున్నవాళ్ళెవరో బాబూ పరుగెత్తరు పడిపోతావు అంటూ రెక్కపట్టుకుని ఆపుచేసారు.

ఏడుస్తూ ఆ పక్కనే చెట్టుకు చిక్కుకున్న బుగ్గవైపు చూపించాడు రవి.

వాళ్లు దాన్ని రవిచేతికిచ్చారు. రవిసంతోషానికి అంతులేదు

"ఎవరితో వచ్చావు బాబూ" ఎంతో ముద్దుగా ఉన్న ఆ బాబుని ప్రశ్నించారు వాళ్లు.

"అలుగో మా నాన్న" అంటూ తండ్రివైపు చూపించాడు.

"అలా వదిలేసారేమిటంతే కొంచెముంటే నీళ్ళలోకి పడి పోనండీ" అంటూ రవిని ఎత్తుకొని తీసుకువచ్చి కుమార్‌కు అప్ప చెప్పారు.

ఆ మాటలు మందలింపులా అనిపించి ఉలిక్కి పడ్డాడు కుమార్. 'థాంక్స్' అనికూడా అతను అననందుకు వాళ్ళు కాస్త ఆశ్చర్యపడ్డారు. తర్వాత తమ పనైపోయినట్లు వెళ్ళిపోయారు. అంతలో చాలామంది పిల్లలు అటు వచ్చారు. వాళ్ళు ఆ కొలనులో దిగి తామరపూలు తెంపుకొని తోటమాలి చూడకుండా పారిపోతున్నారు.

ఆ పూలు చూసిన రవికి చెప్పలేని సంతోషం వచ్చింది. వారికి దగ్గరగా వెళ్లి "నాకో పువ్వు ఇయ్యవా" అడిగాడు ముద్దుగా.

"నువ్వు కోసుకో! కాకపోతే మీ డాడీని కోసిమ్మను" ఆ పిల్లాడు పరుగెత్తాడు.

"నాన్నా! నాన్న! నాకో పువ్వు కోసియ్యి" పేచి మొదలు పెట్టాడు రవి.

"నువ్వే వెళ్ళికోసుకో కసిరాడు"నాన్న అన్న పిలుపు వినగానె అతనికోపం మరింత పెరిగింది. "పో వెధవా" అంటూ కసిరాడు. తండ్రి అలా కోపం చేసేటప్పటికి ఆ చిన్నారి మనసు గాయపడింది. కళ్ళలో నీళ్ళు సుళ్ళు తిరిగాయి ఆ కోపం రోజూ చూస్తూనే ఉన్నాడు. ఆతని తిట్లు రోజు వింటూనె ఉన్నాడు. అయినా ఎప్పటికి అప్పుడు కొత్త.

తనే పువ్వు తెంపుకోవాలని బయలుదేరాడు రవి. మెల్లిగా అడుగులో అడుగు వేసుకొంటూ నీళ్ళ వరకు వెళ్ళాడు. చెయ్యి చాచి చూసాడు. పువ్వు అందలేదు.

నీళ్ళలో అడుగుపెట్టి చెయ్యిచాపాడు. అయినా అంద లేదు. మరికాస్త ముందుకు వెడుతున్నాడు.

కుమార్! అదంతా గమనిస్తూనే ఉన్నాడు, అనుకోని అదృష్టం ఎదురు వచ్చింది. ఇదే సమయం. ఆలస్యం చెయ్య కూడదు అనుకొన్నాడు.

వెంటనే లేచి మెల్లిగా రవికి వెనకగా వెళ్ళి నిలబడ్డాడు. రవి తండ్రిని చూడలేదు. మరింత వంగి పువ్వు అందుకో పోయాడు - చేతికి అందింది కూడా. సంతోషంతో పొంగి పోయాడు.

అంతలోనె కుమార్ రెండు చేతులతో రవిని ముందుకు తోసాడు.

నీళ్ళలో వెళ్ళి పడ్డాడు రవి. అక్కడ నుంచి మెల్లిగా గజ దొంగలా ఒక హంతకునిలా పారిపోయాడు కుమార్. దూరం నుంచి చూసిన వారెవరో పరుగెత్తుకొంటూ వచ్చి రవిని నీళ్ళలో నుంచి తీసారు. అప్పటికే రవి నీళ్ళు బాగా మింగాడు: కెక్కురు కెక్కురు మంటున్నాడు.

వాళ్ళు అతన్ని కింద పడుకోపెట్టి నీళ్లు కక్కించారు. ప్రథమ చికిత్స చేసి ప్రాణం నిలబెట్టారు. తర్వాత అతన్ని తీసుకువెళ్ళి పక్కనే ఉన్న నర్సింగ్‌హోమ్‌లో చేరిపించారు.

అక్కడే పనిచేస్తున్న ఒక నర్సు "వీడు మధు కొడు కండీ" అంది ఆతురతగా.

"ఆ యాక్సిడెంటులో పోయిన మధా"

"అవును డాక్టర్. అతని కొడుకే. ఈ పిల్లాడిమీది ప్రేమతో కుమార్ అనే స్నేహితుడు మధు భార్యను వివాహం చేసుకొన్నాడు.

రవికి ఇంజక్షన్ ఇస్తూనే ఆశ్చర్యంగా విన్నాడు డాక్టర్.

"ఆ కుమార్ ఎవరో చాలా ఉత్తముడు" అన్నాడు డాక్టరు.

రవికి ప్రాణాపాయం తప్పింది. స్పృహ లేకుండా మంచం మీద పడి ఉన్నాడు.

రవిని తీసుకువచ్చిన వాళ్ళు ఇంకా అక్కడే ఉన్నారు. ప్రియాదేవిని తీసుకు రమ్మని ఆయాను పంపించింది ఆ నర్సు. స్కూటర్ యాక్సిడెంటు అయినప్పుడు మధుని కూడా అక్కడికే తీసుకు వచ్చారు. ఆ హాస్టలుల్లోనె మధు చనిపోయాడు. అందుకే అందులో పనిచేసే డాక్టర్లకి, నర్సులకు, ఆయాలకూ మధు కొడుకును, భార్యను ఎంతగానో అభిమానిస్తారు. అందుకే రవికి ఎంతో జాగ్రత్తగా వైద్యం చేస్తున్నారు వాళ్ళు.

అంతలో కుమార్ ఏమీ తెలియనట్లుగా ఇంటికి తిరిగి వచ్చాడు. విచారంగా, వంటరిగా తిరిగి వస్తున్న కుమార్‌ని చూసి ప్రియ కంగారు పడింది.

"కుమార్ ! బాబూ ఏడీ"

"అదే ! ఎటో తప్పిపోయాడు. అంతవరకు అక్కడే ఉన్నాడు. ఒకవేళ ఇంటికి వచ్చేసాడేమోనని తిరిగి వచ్చేసాను"

మరింత బాధ నటిస్తూ చెప్పాడు.

"ఇంటికి రాలేదు? చిన్నపిల్లవాడు ఎక్కడికి పోతాడో చూడకుండా ఏంచేసావు కుమార్?" ఆమెలో ఏదో చెప్పలేని ఆందోళనా భయం. మరోపక్క కుమార్ మాటల్ని నమ్మలేక పోతోంది.

"పోలీసు రిపోర్టు ఇస్తే మంచిదేమో కుమార్"

"నిజమే! నేను ఇచ్చి వస్తాను. నువ్వువద్దు" కుమార్ మాటలు వినిపించుకోకుండా అతని వెంట బయలుదేర బోయింది ప్రియ.

నర్సు పరుగెత్తుకొంటూ వచ్చింది.

"బాబు నీళ్ళలో పడిపోయాడమ్మా! ఎవరో తీసుకొచ్చి హాస్పటల్లో చేర్పించారు?"

ఇంకేమీ వినబడలేదు ప్రియాదేవికి. ఆమె వెంటే హాస్పటల్‌కి పరుగెత్తింది. ప్రియావెంట పరుగెత్తాడు కుమార్.

మంచంమీద పడుకొని ఉన్న బాబును చూసి వెక్కివెక్కి ఏడ్చింది ప్రియాదేవి.

అప్పటికి బాబు మెల్లిగా కదులుతున్నాడు.

"అల్లరి చెయ్యకండి బాబుకేం ప్రమాదంలేదు" డాక్టరు మందలించాడు.

రెండుచేతులతోను నోరు నొక్కుకుంది ప్రియాదేవి. ఆవిడను ఆ స్థితిలో అక్కడి వారు చూడలేక పోయారు. ఆ తల్లిని ఎలా ఓదార్చాలో తెలియలేదు వాళ్ళకి.

"బాబు నీళ్ళలో పడిపోతుంటే మేమే చూసామండీ" అన్నారు ఇద్దరు అబ్బాయిలు.

"మీరా !"

"అవును !"

"ఎలా పడిపోయాడు బాబూ !"

"ఎవరో ఒకాయన తెల్ల ఫాంటు, తెల్ల షర్టు వేసుకొన్నా యన నీళ్ళలోకి తోసేసాడండీ! వెనకనుంచి మేమంతా చూసాం !"

"ఆమె శరీరం పట్టుతప్పడం ప్రారంభించింది.

"ఆయన తర్వాత ఎటో పారిపోయాడండీ"

కుమార్ కట్టుకొన్న తెల్లఫాంటు తెల్ల షర్టు వైపు ఆశ్చ ర్యంగా చూసింది.

ఆమెకు కోపం పట్టపగ్గాలు లేకుండా వచ్చింది. అయినా సభ్యత. సంస్కారం అడ్డువచ్చి ఊరుకొంది.

"నాన్నా ! నాన్నా" కళ్ళు తెరవకుండానే పలవరి స్తున్నాడు.

రవి అందరిలాగె తనుకూడా తండ్రిపక్కన కూర్చొని స్కూటర్‌మీద తిరగాలనీ, తండ్రి పక్కన కూర్చుని భోజనం చెయ్యాలని, తండ్రే స్కూటర్ మీద స్కూలుకు తీసుకు వెళ్ళా లని తండ్రికి ముద్దులివ్వాలని ఎన్నో సరదాలున్నాయి. తల్లిఅన్నీ తీరుస్తోంది. అయినా రవి దృష్టి తండ్రిమీద ఉంది. తండ్రి చీదరించుకొన్నా ఆ తండ్రే కావాలి రవికి.

మెల్లిగా కళ్లువిప్పి చూసాడు. ఎదురుగా తల్లి కనిపించింది.

"బాబూ" అంటూ అతన్ని ఒళ్ళోకి తీసుకుంది ఆ తల్లి.

భుజంమీద పడుకొన్న రవి "అమ్మా! నాన్న కావాలి" అంటూ పేచీ మొదలు పెట్టాడు.

కుమార్ హృదయం పశ్చాత్తాపంతో కుమిలిపోయింది.

"తనను అంతగా ప్రేమించే ఆ పిల్లవాని మీదనా ఇంత కక్ష" అనుకొన్నాడు మనస్సులో.

"బాబూ! వచ్చేసారా! నాన్నా" అంటూ అతన్ని అందుకొని గుండెలకు హత్తుకొన్నాడు రవికుమార్.

(ఆంధ్రభూమి డైలీ ఉగాది కథల పోటీలో ఎన్నికైన కథ)